ఆర్‌టిసి బస్సులను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

ఆర్‌టిసి ఆఫర్..!

- రానుపోను రిజర్వేషన్‌కు 10 శాతం రాయితీ
- దసరాకు ప్రత్యేక బస్సులు
- ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలే

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రయాణీకులకు ఇది నిజంగా శుభవార్తే.. దసరా పండుగ వచ్చిందంటే ప్రత్యేక బస్సుల పేరిట 50 శాతం పైగా ఛార్జీలు వసూలు చేసేవారు. ప్రస్తుతం ప్రయాణీకులకు ఆర్టీసి డబుల్ ధమాకా అందిస్తోంది. ప్రస్తుత దసరా పండుగ సందర్భంగా సుదూర ప్రాంతాలకు సాధారణ ఛార్జీలతో ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ప్రయాణీకులు రానుపోను రిజర్వేషన్ చేయించుకుంటే 10 శాతం రాయితీ అందిస్తోంది...

దసరా పండుగ వస్తుందంటే వివిధ రాష్ట్రాలు, జిల్లాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు, వివిధ పనులపై వెళ్ళేవారు స్వగ్రామాలకు రావటం జరుగుతోంది. సూదూర ప్రాంతాల నుంచి ప్రజలు సొంత ఊళ్ళకు రావటానికి సరిపడిన రవాణా సౌకర్యాలు లేక ప్రైవేట్ ట్రావెల్స్ ను ఆశ్రయిస్తుంటారు. ఇదే అదనుగా ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు దోపిడీకి తెరలేపుతున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టీసి ప్రత్యేకబస్సులు నడిపేందుకు నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఎపిఎస్‌ఆర్టీసి ప్రత్యేక బస్సులను నడుపుతోంది. కర్నూలు జిల్లాలో మొత్తం 164 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. నంద్యాల జిల్లాలో 79 ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, చెన్నై, విజయవాడ నుంచి కర్నూలుకు 81 బస్సులు, 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ కర్నూలు నుంచి హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, చెన్నై, విజయవాడకు 83 బస్సులను నడపనున్నారు. 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ

హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు నుంచి నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాలకు, 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్, విజయవాడ, బెంగళూరుకు ఈ బస్సు సర్వీసులను నడపనున్నారు. ఆళ్లగడ్డ డిపో నుంచి 11 బస్సులు, ఆత్మకూరు డిపో నుంచి 10 బస్సులు, బనగానపల్లె నుంచి 11 బస్సులు, డోన్ నుంచి 10 బస్సులు, కోవెలకుంట్ల నుంచి 12 బస్సులు, నంద్యాల నుంచి 25 బస్సులు చొప్పున నడవనున్నారు. గతంలో ఆర్టీసి ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు ఛార్జీ వసూలు చేసేవారు. ప్రస్తుతం ప్రత్యేక బస్సు సర్వీసుల్లోనూ సాధారణ ఛార్జీలే వసూలు చేయనున్నారు. ఎసి స్లీపర్, నాన్ ఎసి స్లీపర్ సర్వీసుల్లో కూడా సాధారణ ఛార్జీలే వసూలు చేయనున్నారు. ప్రయాణీకులు ఆన్లైన్ లేదా సమీపంలోని ఎటిబి ఏజెంట్ ద్వారా ముందస్తు రిజర్వేషన్ పొందవచ్చు. రానుపోను ఒకే సారి రిజర్వేషన్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ సౌకర్యం కల్పించనున్నారు. ప్రత్యేక సర్వీసులతో పాటు రెగ్యులర్‌గా నడిచే కర్నూలు జిల్లాలో 424 బస్సులు, నంద్యాల జిల్లాలో 491 బస్సులు కూడా ప్రయాణికులకు సేవలు అందించనున్నాయి.

ఆర్‌టిసి సేవలు వినియోగించుకోవాలి

దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులు ముందస్తు రానుపోను రిజర్వేషన్ చేసుకున్న వారికి ఛార్జీలో 10 శాతం రాయితీ ఇస్తున్నాం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనంగా బస్సులు నడుపుతాం. ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా మామూలు ఛార్జీలతోనే ప్రయాణికులకు సేవలు అందిస్తాం. వేగంగా ప్రయాణించాలనే తపనతో ప్రయాణికులకు ప్రయివేటు వాహనాల్లో వెళ్లి ప్రాణాలు కోల్పోకుండా ప్రజల రక్షణే ధ్యేయంగా నడుపుతున్న ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరాలి. ఆర్టీసి సేవలను ప్రయాణికులు అందరూ వినియోగించుకోవాలి.

- టి.శ్రీనివాసులు, జిల్లా ప్రజా రవాణా అధికారి.

ముందు చూపుతో వెళ్తున్న టిడిపి ప్రభుత్వం

- కర్నూలు బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తాం
- మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

టిడిపి ప్రభుత్వం ముందు చూపుతో వెళుతుందని అందులో భాగంగా కొత్త బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థం ప్రారంభిస్తున్నామని ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల శాఖ మంత్రి టిజి .భరత్ అన్నారు. మంగళవారం కర్నూలు-1 డిపో గ్యారేజీలో 2 కొత్త సూపర్ లగ్జరీ బస్సులను, కొత్త అల్ట్రా డీలక్స్ బస్సులను కర్నూలు మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సును ఆయన నడిపారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు కర్నూలు బస్టేషన్ రాష్ట్రంలోనే మంచి బస్టేషన్‌గా పేరుండేదన్నారు. ఆ పేరును నిలబెట్టే విధంగా కృషి చేస్తామన్నారు. కర్నూలుకు గుండెలాంటిబస్టాండ్ స్థలం దండిగా ఉంది. ఆ స్థలంలో మంచి కన్వెన్షన్ హాల్ నిర్మించేందుకు ప్రణాళికల సిద్ధం చేయాలని ఆర్‌ఎంకు సూచించామన్నారు. కర్నూలు బస్టాండును అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజారవాణా అధికారి టి.శ్రీనివాసులు మాట్లాడుతూ నేడు ప్రారంభించిన బస్సులలో ఒక సూపర్ లగ్జరీ బస్సు కర్నూలు-బెంగళూరు రూటులో, మరో సూపర్ లగ్జరీ బస్సు, అల్ట్రా డీలక్స్ బస్సులను కర్నూలు-తిరుపతి రూట్లలో తిప్పుతామన్నారు. కర్నూలు-1 మేనేజర్ సుధారాణి, కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుస్సేన్, పాల్గొన్నారు.

ఉల్లి,టమోటా ధరలను నియంత్రించాలి

మంత్రి టిజి. భరత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో ఉల్లి, టమోట ధరలను నియంత్రణలో ఉంచాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మంత్రి టిజి.భరత్, జిల్లా కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి టిజి. భరత్ మాట్లాడుతూ జిల్లాలో ఉల్లి, టమోట ధరలు అసాధారణ రీతిలో పెరగకుండా ప్రజలకు అందుబాటులో ఉండేలా నియంత్రణలో ఉంచాలన్నారు. కూరగాయల ధరలు అసాధారణ రీతిలో పెరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతిరోజు జిల్లాలో ధరల వివరాలకు సంబంధించిన నివేదికను తనకు పంపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా మాట్లాడుతూ ..ప్యాపిలి నుండి రోజూ 3 టన్నుల టమోటా ను తెప్పిస్తున్నామన్నారు. కిలో రూ.40 నుండి రూ.45 లోపు టమోటా ధరలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉల్లి ధర కూడా రూ.36ఉండేలా చర్యలను తీసుకుంటున్నామన్నారు. వంట నూనెల ధరల నియంత్రణకు కూడా తగిన చర్యలను తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.

కంది,పొగాకు పంటల పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలంలో పూడిచెర్ల , కేతవరం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పొగాకు , కంది పంటలను మండల వ్యవసాయ అధికారి సుధాకర్ పరిశీలన చేశారు . పొగాకులో అక్కడక్కడ ఆకుముడత తెగుళ్లను గమనించారు. ఈ వైరస్ తెగులు తామర పురుగుల నుంచి వ్యాపిస్తుందని తెలిపారు. దీని నివారణకు జిగురు అట్టలను హెక్టారుకు 12 నుండి 15 చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. తయోమితాబైటమ్ రెండు గ్రాములు లీటర్ నీటికి లేదా ఎసిపేటు 2.5 గ్రామ్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ భాస్కర్, రైతు సేవా కేంద్ర సిబ్బంది అమీర్ ఖాన్ ,ఏంజెల్ , గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు పెంచే ఆలోచన విరమించుకోవాలి

- ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిబెట్టుకోవాలి
- ప్రభుత్వం దిగిరాకపోతే ఆందోళనకు సిద్ధం
- పిపిఎస్‌ఎస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పలు అసోసియేషన్ల నిర్ణయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ భారాలు పెంచే ఆలోనను ప్రభుత్వం విరమించుకోవాలి. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉండాలి. విద్యుత్ భారాలను తగ్గించకపోతే ఆందోళనకు సిద్ధం కావాలి.' పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయా అసోసియేషన్ల ప్రతినిధులు హెచ్చరించారు. గత ప్రభుత్వ కాలంలో రెండేళ్లకు సంబంధించి ఇంధన కొనుగోలు వ్యయం

రౌండ్‌టేబుల్ సమావేశంలో పుల్లారెడ్డి

చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం దాదాపు రూ.20 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం వేయబోతున్నట్లు ప్రచారం జరుగుతుందని, విద్యుత్ చార్జీలను నియంత్రిస్తాం! తగ్గిస్తాం! అంటూ ఎన్నికల ముందు ఎన్‌డిఎ కూటమి ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం మాట నిలుపు కోవాలని వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలపై పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిఎఎస్ కళ్యాణ మండపంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యాకోబు అధ్యక్షత వహించారు. ఆయా అసోసియేషన్ల ప్రతినిధులు చెప్పిన వివరాల ప్రకారం వారి మాటల్లో....

సర్‌ఛార్జీల పేరుతో భారీగా విద్యుత్ బిల్లులు

- విద్యాసంస్థల జిల్లా అధ్యక్షులు వాసు దేవయ్య

గత ప్రభుత్వంలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచారు. విద్యుత్ చార్జీల టారిప్ చూస్తే 30, 70, 120 యూనిట్లకు ఒక్కో స్లాబ్ కు ఒక రేటు పెంచారు. విద్యుత్ కాల్చిన యూనిట్ల కన్నా సర్ చార్జీలు, కస్టమర్ చార్జీలు,ఎనర్జీ చార్జీలతో పాటు రాత్రి వాడే వారికి అదనంగా 10 శాతం చార్జీలు వేస్తున్నారు. దీనితో భవిష్యత్తులో సామాన్య ప్రజలు విద్యుత్ చార్జీలు కట్టలేని పరిస్థితి నెలకొంటుంది.

ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు రామచంద్రారెడ్డి

ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. ట్రూ అఫ్ చార్జీలను తీసివేయాలి. 2019 నుండి రకరకాలుగా పన్నుల భారాలు వేస్తూ విద్యుత్ చార్జీలను కూడా పెంచేశారు. కర్నూలు ఆయిల్ మిల్స్‌లో రెండో బాంబేగా ఉండేది. ఆయిల్ మిల్స్ 30 దాకా ఉండేవి అవి 20కి తగ్గాయి. విద్యుత్ చార్జీలతో పాటు ఇంటి పన్నులను కూడా రిజిస్ట్రేషన్ చార్జీలతో పాటు పెంచేస్తున్నారు. పిపిఎస్‌ఎస్ ద్వారా తగ్గించే విధంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది.

విద్యుత్ చార్జీలు పెంచితే కట్టడం కష్టమవుతుంది

- హోటల్స్‌ను అసోసియేషన్ నాయకులు జాకీర్‌బాషు

విద్యుత్ చార్జీలు తగ్గించాలి. పెంచితే కట్టడం కష్టమవుతుంది. కొన్ని ప్రాంతాల్లో ఇంటి బాడుగలకన్నా కరెంటు బిల్లు ఎక్కువవుతున్నాయి. ఇతర వాటిపై సంపాదించి కరెంట్ బిల్లులు చెల్లించాల్సి వస్తుంది.

సామాన్య ప్రజలపై భారాలు వేయడం సరికాదు

- న్యాయ వాది మణిచందర్ రాజు

సామాన్య ప్రజలపై భారాలు వేయడం సరికాదు. మేక్ ఇన్ ఇండియా పేరుతో బడా కంపెనీలు పెట్టుబడి పెట్టడం వల్ల వారు సబ్సిడీలు పొందుతున్నారు. బయోగ్యాస్, పెట్రోల్ సోలార్ ప్లాంట్ లాంటివి పెట్టి యువతకు ఉపాధి కల్పించి. ఆదాయాన్ని పెంచేలా కృషి చేయాలి. ఆదాయాలు పెంచకుండా విద్యుత్ బిల్లులు పెంచడం సరికాదు.

పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం.నాగరాజు, వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు , మద్దిలేటి, విజయ్ కుమార్, ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. ఐదేళ్లలో గత ప్రభుత్వం దాదాపు 100శాతం కరెంటు చార్జీలను పెంచిందన్నారు. మళ్లీ కరెంట్ చార్జీలు పెంచితే భరించలేమని, ఉన్నత వర్గాలపై భారాలు వేయండని, పేద మధ్యతరగతి ప్రజలు, సూక్ష్మ, చిన్న పరిశ్రమలపై విద్యుత్ భారాలు వేయాలనే ఆలోచన విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేస్తాయాని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో వన్నూరు సాహెబ్, ఎండి యూనిస్, రాజు, వెంకటేశ్వర్లు, సివి వర్మ, రమణ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఇతర అధికారులు

ఈ - పంట నమోదును పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు మండల రైతాంగం ఈ సీజన్లో పండిస్తున్న పంటలపై వ్యవసాయ శాఖ చేపడుతున్న ఈ పంట నమోదుపై జాయింట్ కలెక్టర్ నవ్య మంగళవారం ప్రత్యేక పర్యవేక్షణచేశారు. కోడుమూరు మండలంలో రైతులు పండిస్తున్న పంటలను దస్త్రాల ఆధారంగా పరిశీలించారు. ఈ పంట నమోదు రికార్డులను పరిశీలించడం కోసం వెంకటగిరి గ్రామంలో ఒక రైతు సర్వే నంబర్లు వేసిన పంటను పరిశీలించారు. ఈ పంట నమోదు వలన పంట అమ్మకానికి ,నష్ట పరిహారం అందించడానికి, ఏ రైతు ఏ పంట వేశాడు తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేష్ నాయక్, మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సాగుదారుల అరెస్టు

ఆరు కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-సి బెళగల్ : సిబెళగల్ మండలం పలుకుదొడ్డిలో గంజాయి అక్రమ సాగుదారులను పోలీసులు అస్టు చేశారు. మిద్దె రాముడును అతడికి గంజాయి విత్తనాలు అందించిన సి బెళగల్ హనుమంతును సి.బెళగల్ ఎస్. తిమ్మారెడ్డి మంగళవారం అరెస్టు చేశారు.ఆ వ్యక్తులు అట్ట పెట్టలలో సుమారు ఆరు కేజీల వంద గ్రాముల గంజాయిని భద్రపరిచి తరలిస్తున్న తరుణంలో ఎస్ఐ సిబ్బంది కలిసి అనుమానాస్పదంగా అపుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసును లోతుగా దర్యాప్తు చేయడంతో అక్రమ సాగులోకి వెళ్లి కేసు నమోదు చేశారు. కేసునమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

నిందితులతో ఎస్ఐ తిమ్మారెడ్డిం

ఎపిఎంగా రామాంజనేయులు



ప్రజాశక్తి-మద్దికేర : మండల సమాఖ్య ఎపిఎంగా బాధ్యతలు స్వీకరించినట్లు రామాంజనేయులు తెలిపారు. మద్దికేరలో మండల సమాఖ్య కార్యాయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డోన్ మండలం నుండి మద్దికేర మండలానికి ఎపిఎంగా రామాంజనేయులు, సిసి గా రాజన్న, పత్తికొండ మండలం నుండి సిసి గా గోవిందు, బదిలీ అయినట్లు తెలిపారు. జీవనోపాదుల, రుణాల ద్వారా మహిళల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. మండలంలో పొదుపు సంఘాల మహిళలు, ప్రజలు నాయకులు తమకు సహకరించాలని సూచించారు.

వీధి కుక్కల బెడదను అరికడతాం

వీధి కుక్కదాడి బాధితులకు మంత్రి రూ.10 వేల ఆర్థికసాయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో వీధి కుక్కల బెడదను అరికడతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ అన్నారు. మంగళవారం నగరపాలక కౌన్సిల్ హాలులో ఇటీవల నగరంలోని పాతబస్తీలో వీధికుక్క దాడిలో గాయపడ్డ 36 మంది బాధితులకు నగరపాలక సంస్థ తరపున ఒక్కొక్కరికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మంత్రి టిజి భరత్ అందజేశారు. మంత్రి భరత్ మాట్లాడుతూ గత నెల 30న తాను ప్రభుత్వ అతిథిగృహంలో నగరంలో వీధి కుక్కల నియంత్రణపై చర్చించినట్లు తెలిపారు. ఆ తర్వాత కొద్దిసేపటికే చిన్నారులపై పిచ్చికుక్క దాడి చేసిందని, ఈ విషయం తెలిసిన వెంటనే కలెక్టర్, కమిషనర్‌తో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లానన్నారు. బాధితులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశించామన్నారు. వెంటనే ఆర్థిక సాయాన్ని కూడా ప్రకటించామన్నారు. కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్లు మళ్లీ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న రెండు నెలల్లో ఈ సమస్యకు జవాబుదారీతనంతో శాశ్వత పరిష్కారం చూపాలని నగరపాలక అధికారులను ఆదేశించారు. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందని, ఇతర నగరాల్లో అనుసరిస్తున్న విధానాలను తెలుసుకోవాలని, నగరంలో పూర్తి స్థాయిలో కుక్కల బెడద నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ప్రజలకు కష్టాలు వస్తే, తాము ఎప్పుడు ముందు ఉంటామన్నారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, సంతాన నియంత్రణ ఆపరేషన్ల సామర్థ్యాన్ని పెంపునకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఇచ్చిన వివరాల ప్రకారం 36 మంది బాధితులకు ఆర్థిక సాయం అందజేశామన్నారు. 30 మందికి చెక్కుల రూపంలో, ఆరుగురికి నగదు రూపంలో ఆర్థిక సాయం అందజేసినట్లు పేర్కొన్నారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, ఆరోగ్యాధికారి కె.విశ్వేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు.

ఆర్థికసహాయం అందజేస్తున్న మంత్రి టిజి.భరత్

14 నుండి 'పల్లె పండుగ వారోత్సవాలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఈ నెల 14 నుండి 20 వరకు పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలను ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాష తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పాల్గొని మాట్లాడారు. పల్లె పండుగ - పంచాయితీ వారోత్సవాల సందర్భంగా జిల్లాలో రూ. 105 కోట్లతో సిమెంట్ రోడ్లు, గోకులంలు తదితర పనులకు శంకుస్థాపనలు నిర్వహించనున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యేలను సంప్రదించి రోజువారీ షెడ్యూల్‌ను తయారు చేస్తామన్నారు. గ్రామ సచివాలయ, ఉపాధి హామీ, లైన్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది అందరూ హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్చార్జి డ్వామా పిడి మాధవీలత, పంచాయతీ రాజ్ ఎస్ఇ రామచంద్రా రెడ్డి, ఈ మద్దన్న, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు

గొర్రెల సహకార సంఘం చైర్మన్ గా శ్రీనివాసులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల సహకార సంఘం ఎన్నికల్లో 12 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికై శ్రీనివా సులును చేర్మన్ గా ఎన్నుకున్నారని, అందుకు కర్నూలు జిల్లా కురువ సంఘం అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు మాజీ అధ్యక్షులు గడ్డం రామకృష్ణ అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకె.రంగస్వామి, 25 వ వార్డు కార్పొరేటర్ సిట్రా సత్యనారాయణమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు ధనుంజయ అభినందనలు తెలిపారు.

శ్రీనివాసులుతో సిట్రాసత్యనారాయణమ్మ , తదితరులు

ఇసుక విధానం పకడ్బంధీగా చేపట్టాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి- సి బెళగల్

ప్రభుత్వం ఇసుక నూతన విధానం అమలులోకి తెచ్చిందని, పకడ్బాందిగా చేపట్టాలని ఆర్‌డిఒ శ్రవణ్ కుమార్ మండలంలోని రెవిన్యూ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ముడుమాల, ఈర్లదిన్నె, సింగవరం, పలదొడ్డి, కొత్తకోట ఇసుక రీచులను ఆర్‌డిఒ, తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి సమక్షంలో పరిశీలన చేశారు. ఎలాంటి అవకతవకలకు తావివ్వరాదని అన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు వాహనాలతో వచ్చే డ్రైవర్లు కేటాయించిన తేదీలలోనే ఇసుక ఇవ్వాలన్నారు. ప్రధానంగా సంబంధించిన సిబ్బంది వేళలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శ్రవణ్‌కుమార్

విధుల్లో చేరిన పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి- పత్తికొండ

పత్తికొండ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం పత్తికొండ ఆర్‌డిఒగా ఎస్ .భరత నాయక్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎస్.భరత్ నాయక్ శ్రీకాకుళం జిల్లా పలాస రెవెన్యూ డివిజన్ నుండి పత్తికొండ రెవెన్యూ డివిజన్ నుంచి ఆర్‌డిఒగా పత్తికొండకు బదిలీ అయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్‌డిఒ నీలపు రామలక్ష్మి బాపట్ల జిల్లా రేపల్లె రెవిన్యూ డివిజన్‌కు బదిలీపై వెళ్లారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్‌డిఒ: కర్నూలు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషను పత్తికొండ ఆర్‌డిఒ ఎస్. భరత్ నాయక్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

మరళిలో ఇసుక ఓపెన్ రీచ్ ప్రారంభించాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 16న కౌతాళం మండలం మరళిలో ఇసుక ఓపెన్ రీచ్‌ను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 16నుండి మరళి ఇసుక రీచ్ ఆపరేషన్ లోకి రావాలన్నారు.. ఈనెల 10నాటికి టెండర్ టైం ముగుస్తుందని, తదుపరి బిడ్డర్లను ఎంపిక చేసి, 16న రీచ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గనులు శాఖ డిడిని ఆదేశించారు. ప్రభుత్వ పనులకు ప్రాధాన్యతను ఇస్తూ ఇసుకను కేటాయించాలని ఆదేశించారు. అక్రమంగా ఇసుకను తరలించకుండా టాన్స్‌పోర్స్ అధికారులు, సిసి కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, గనుల శాఖ డిడి రవిచంద్, కర్నూలు ఆర్‌డిఒ సందీప్, డిఎస్‌పి బాబు ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, డిపిఒ భాస్కర్, డిటిసి శాంతకుమారి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఒప్పందాలను వెంటనే అమలు చేయాలి

ఆశావర్కర్ల వినితి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఆశ వర్కర్లతో గతంలో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు ఎస్.శాంతమ్మ సుశీల పార్వతి డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్ మండలంలోని నన్నూరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజుకు వారు వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ వర్క్ సెంటర్ వర్క్ అదనపు పనులు చేయాలని సెల్ ఫోన్స్‌తో ఆశ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నార న్నారు.60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆశాలకు రిటైర్డ్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. అర్హులైన ఆశ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఈసందర్భంగా వారు డిమాండ్ చేశారు.

డాక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్ల

ఈకెవైసి తప్పనిసరి

- పంట నమోదును పరిశీలించిన జెసి నవ్య

ప్రజాశక్తి - గోనెగండ్ల

పంటల నమోదును పరిశీలిస్తున్న జెసి

ప్రతి రైతూ పంట నమోదు చేయించుకోవాలని, పంట నమోదు చేసుకొన్న ప్రతి రైతూ ఈకెవైసి చేయించుకోవాలని జెసి డాక్టర్ నవ్య తెలిపారు. మంగళవారం ఖరీఫ్ - 2024 సీజన్‌లో సాగు చేసిన పంట నమోదు, నాణ్యతను గంజహళ్లి గ్రామ శివారులో పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ పంటలో నమోదు చేశారు. ఈ పంట నమోదు ఏ విధంగా జరిగిందని పరిశీలించడంతోపాటు రైతులతో మాట్లాడి జెసి వివరాలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ... ఈకెవైసి చేయించుకుంటేనే పంట కొనుగోలు సాధ్యమవుతుందని తెలిపారు. ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ హేమలత, తహశీల్దార్ కుమార స్వామి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది షఫీ, చైతన్య, విఆర్ఒ మల్లికార్జున పాల్గొన్నారు.

టిడిపితోనే ఆర్‌టిసి అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి - నూతన బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రారంభించిన ఆర్‌టిసి బస్సులతో ఎమ్మెల్యే బీవీ

ఆర్‌టిసి అభివృద్ధికి టిడిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం త్వరలోనే ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు ఆర్‌టిసి నూతనంగా నాలుగు బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. బస్సును ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి నడిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఒక బస్సు గానీ, రైలు తెచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎమ్మిగనూరు ఆర్‌టిసి బస్టాండ్‌ను తన తండ్రి, మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆర్‌టిసి బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆర్‌టిసి డిపో మేనేజర్ అమర్‌నాథ్, టిడిపి నాయకులు రాందాస్ గౌడ్, రంగస్వామి గౌడ్, రూప జగదీష్, ప్రతాప్, ఉరుకుందయ్య శెట్టి, అల్తాఫ్ పాల్గొన్నారు.

మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుదాం

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

మొక్కలు నాటుతున్న కమిషనర్ కృష్ణ

పట్టణంలో ఇంటి ఆవరణం, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించి పర్యావరణాన్ని కాపాడదామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని మండగిరి 19వ వార్డు ఆర్‌టిసి కాలనీలో పచ్చదనం, పరిశుభ్రతలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. మోటార్ వెహికల్స్ వాడకం రోజురోజుకు అధికమవుతోందని తెలిపారు. వాటి నుంచి వెలువడే పొగ వల్ల కాలుష్యం పెరిగి పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. మొక్కలు పెంచడం వల్ల కార్బన్‌డయాక్సైడ్ అధికం కాకుండా నివారిస్తాయని తెలిపారు. అంతకుముందు కాలనీలో పర్యటించి శానిటేషన్ పనుల ను పరిశీలించారు. వార్డు టిడిపి ఇన్‌ఛార్జీ శ్రీనివాస్ ఆచారి మాట్లాడుతూ... రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతిపాదన సిద్ధం చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. వార్డు నాయకులు ధర్మ, రవి, చాంద్ బాషా, హనుమంతు ఉన్నారు.

జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి

- ప్రభుత్వ డాక్టర్లు పార్వతమ్మ, అప్రోజ్ జహాన్

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆశాల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్లు

గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు ప్రభుత్వ డాక్టర్లు పార్వతమ్మ, అప్రోజ్ జహాన్ సూచించారు. మంగళవారం ప్రభుత్వాస్పత్రి ఆవరణలో సిహెచ్ఒ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 'ఆశా డే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పుట్టిన పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ముఖ్యంగా రక్తహీనతకు గురికాకుండా బలవర్థకమైన ఆహారం ఆకుకూరలు, పాలు, గుడ్డు తప్పనిసరిగా వాడాలని సూచించారు. ఇంట్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది విమలాదేవి, పద్మావతి, రామ్మోహన్ పాల్గొన్నారు.

దోభీఘాట్ ధ్వంసం

- బట్టలు ఉతికేందుకు ఇబ్బంది పడుతున్న రజకులు

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో ఉన్న దోభీఘాట్ ధ్వంసమైంది. బట్టలు ఉతికేందుకు దోభీఘాట్ లేక రజకులు ఇబ్బంది పడుతున్నారు. వారిని ఆదుకునే నాథుడే కరువయ్యారు. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తమను ఆదుకోవాలని రజకులు కోరుతున్నారు.

మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు నాలుగెకరాల పొలాన్ని రైతుల దగ్గర కొనుగోలు చేసి నందవరం రజకులకు ఇచ్చారు. వృత్తిరీత్యా రజకులు బట్టలు పిండుకోవటానికి ఆ పొలంలో దోభీఘాట్లను నిర్మించారు. రూ.లక్షలు ఖర్చు చేసి అక్కడ ఉన్న బావిలో పూడిక తీసి దోభీఘాట్లకు నీరందించారు. రజకులు వృత్తిరీత్యా పనులు చేసుకోవడానికి పొలాన్ని కేటాయించి, దోభీఘాట్ నిర్మాణం, వాటికి నీటి సరఫరా, విద్యుత్ సదుపాయాలను కల్పించి బీవీ.మోహన్ రెడ్డి రజకులను ఆదుకున్నారు. ఆయన రజకులకు అవసరమైన ఇస్త్రీపెట్టెలు, రాగి బిందెలు, వస్తువులను అందజేశారు. ఆయన మరణించిన తర్వాత తమను పలకరించిన నాయకుడే లేరని రజకులు వాపోతున్నారు. బీవీ.మోహన్‌రెడ్డి రజకులకు కేటాయించిన భూమి ఇప్పుడు అడవిగా మారింది. దోభీఘాట్ పూర్తిగా ధ్వంసమైంది. ఆయన ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, మోటార్లు అక్కడ కనిపించడం లేదు. అక్కడ ఉన్న బావి పూడికతో నిండిపోయింది. అప్పట్లో వర్షాలు బాగా కురిసేవని, వాగులు ఉండేవని, తమ విధులు సక్రమంగా నిర్వహించే వారమని రజకులు పేర్కొంటున్నారు. ప్రస్తుత కాలంలో వర్షాలు సరిగ్గా కురవడం లేదని, వాగులో చుక్కనీరు లేదని చెబుతున్నారు.

పూడికతో నిండిన బావి

ధ్వంసమైన దోభీఘాట్

రజకులను ఆదుకోవాలి

- చాకలి వెంకటేష్, నందవరం

రజకుల పక్షపాతి మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి. ఆయన రజకుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆయన తనయుడు, ప్రస్తుత ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి రజకులను ఆదుకోవాలి. రజకుల కోసం కేటాయించిన భూమిని శుభ్రపరిచి దోభీఘాట్ నిర్మాణం చేపట్టాలి.

పూడిక తీయించాలి

- చాకలి ఈరన్న, నందవరం

రజకులను ఆదరించిన ఏకైక వ్యక్తి మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి. ఆయన మరణించిన తర్వాత రజకులను పలకరించిన నాయకులు లేరు. ఆయన కుమారుడు బీవీ ఆశయాలను నెరవేర్చాలి. ఇక్కడున్న బావి పూడికతో నిండిపోయి ఉంది. ఎమ్మెల్యే బావిలో ఉన్న పూడికను తీయించాలి. బట్టలు ఉతికేందుకు నీరు లేక ఇబ్బందిగా ఉంది. బావిలో పూడిక తీయిస్తే నీరు సమృద్ధిగా ఉంటుంది. బీవీ.మోహన్ రెడ్డి రజకులకు ఇచ్చిన భూమిలో దోభీఘాట్ పనులను చేపట్టి రజకులను ఆదుకోవాలి.

ప్రభుత్వ న్యాయవాదిగా సిద్ధప్ప

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు నియోజకవర్గ జూనియర్స్ సివిల్ జడ్జి కోర్టుకు ప్రభుత్వ న్యాయవాదిగా సీనియర్ న్యాయవాది సిద్ధప్పను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. మంగళవారం టిడిపి లీగల్ సెల్ నాయకులు జనార్ధన్, విజయ భాస్కర్, వీరేష్, వాయిజీవోత్తమ రావు, వలీ, ప్రవీణ్ కుమార్, రాజగోపాల్ నాయుడు సిద్ధప్పకు అభినందనలు తెలిపారు. సిద్ధప్పను ఎంపిక చేసిన ప్రభుత్వానికి, టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సిద్ధప్ప మాట్లాడుతూ... ప్రభుత్వం తనను ఎంపిక చేసినందుకు, తన ఎంపికకు కృషి చేసిన లీగల్ సెల్ ప్రతినిధులకు, టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌కు, తోటి న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. తన విధులను సక్రమంగా నిర్వహించి బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా కృషి చేస్తానని చెప్పారు.

సిద్ధప్పను అభినందిస్తున్న నాయకులు

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - ఆలూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆనంద్ రాజ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆలూరు జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, సన్ కిసాన్ అగ్రి అండ్ కో, నవ భారత ఫర్టిలైజర్స్ ప్రతినిధులు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దాదాపు 95 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు. వీరిలో 35 మంది ఉద్యోగాలకు ఎంపికయినట్లు వారు తెలిపారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వీరేష్, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయి తేజ, నాన్ టెక్నికల్ ఆఫీసర్ వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంపికయిన అభ్యర్థులు

మానసిక రుగ్మతులను నివృత్తి పరచుకోవాలి

- డిఎంహెచ్ఒ భాస్కర్

ప్రజాశక్తి - ఆదోని

ఆధునిక యుగంలో మానసిక ప్రశాంతత కరువై చాలామంది రుగ్మతలతో సతమతమవుతున్నారని, అలాంటివారు సందేహాలను నివృత్తి చేకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎల్.భాస్కర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ సోమన్న సమక్షంలో పని ప్రాంతంలో ఒత్తిడిపై అవగాహన కార్యక్రమం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్ మాట్లాడారు. మానసిక సమస్యల పరిష్కారానికి 'టెలి మానస్' ఎంతో ఉపయుక్తమని తెలిపారు. మానసిక ఒత్తిడి, భయాందోళనలు, ఇతర సమస్యలు ఉన్నవారు టెలిమానస్ టోల్ ఫ్రీ నెంబర్ 14416కి ఫోన్ చేసి సమస్యలు తెలపాలని కోరారు. ఇక్కడ సుశిక్షితులైన కౌన్సిలర్లు అందుబాటులో ఉంటారని, తగిన సలహాలు, సూచనలు ఉచిత సేవలు పొందవచ్చని తెలిపారు. ఎప్పుడూ ఒంటరిగా ఉండడం, తీవ్రమైన చికాకు, నిరాశ, నిస్పృహ వంటి లక్షణాలు ఉంటే ప్రాథమిక దశలో గుర్తిస్తే నియంత్రించవచ్చని చెప్పారు. చాలామంది మానసిక సమస్య ఉందని తెలిసినా చికిత్సకు రావడం లేదని, ఇలాంటి వారిని గుర్తించి వైద్యాధికారుల దృష్టికి తీసుకొని పోవాలని కోరారు. ఆదోని ప్రభుత్వాస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస నాయక్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమ వైద్యాధికారి డాక్టర్ చైతన్య కుమార్ పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కర్

రోగులకు మెరుగైన వైద్యమందించాలి

ఎన్‌టిఆర్ వైద్య సేవ రోగులకు మెరుగైన వైద్యమందించాలని, వారి నుండి నగదు వసూలు చేస్తే చర్యలు తప్పవని డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్ తెలిపారు. పట్టణంలోని మధు హాస్పిటల్, వంశీచైతన్య హాస్పిటళ్లను ఆయన తనిఖీ చేశారు. డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవల రికార్డులు, రిపోర్ట్స్‌ను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల నుంచి అక్రమంగా నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, విచారణలో తెలలేదని అన్నారు ఆదోని ఎంసిహెచ్ హాస్పిటల్‌లో డెలివరీ, సిజేరియన్ సిబ్బంది వివరాల రికార్డ్స్ పరిశీలించారు. డిసిహెచ్ఎస్ డాక్టర్ మాధవి, ఎంసిహెచ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీలత, డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ రెడ్డి ఉన్నారు.

రోగితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కర్

ఇన్‌ఛార్జీ సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని ఇన్‌ఛార్జీ సబ్ రిజిస్ట్రార్‌గా ఎం.హాజీమయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సబ్ రిజిస్ట్రార్ వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. అనంతరం నూతన సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.హాజీమయ్య మాట్లాడుతూ... డోన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఇక్కడ విధులు కేటాయించారన్నారు. మండలంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన నూతన సబ్ రిజిస్ట్రార్‌ను మండల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డాక్యుమెంట్ రైటర్స్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి పరీక్ష

దరఖాస్తుల సవరణకు 9 వరకు గడువు : ప్రిన్సిపల్ పద్మావతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26వ విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు వారి దరఖాస్తుల్లో తప్పుల సవరణ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఈ.పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తుల్లో ఏమైనా తప్పులుంటే ఈనెల 9లోపు సవరణ చేసుకునే వీలు కల్పించనున్నారని తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు https://cbseitms.rcil.gov.in/nvs వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

కంపోస్ట్ యార్డు సందర్శన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని సోగనూర్ రోడ్డులో గల కంపోస్టు యార్డును మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి మంగళవారం సందర్శించారు. కంపోస్ట్ యార్డును పరిశీలించి రీసైక్లింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఎఇ మదన్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీశీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయానికి సిఎం, డిప్యూటీ సిఎం ఫొటోలు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని చిన్నకడబూరు సచివాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలను మంగళవారం టిడిపి, జనసేన నాయకులు అందజేశారు. టిడిపి గ్రామ అధ్యక్షులు ఎంజి.నరసన్న, జనసేన పార్టీ నాయకులు మహాదేవ, టిడిపి నాయకులు కలగట్ల లక్ష్మన్న, గౌళ్ల నల్లారెడ్డి, సుక్క నరసన్న, కల్లు లక్ష్మన్న, డోలు రామాంజినేయులు, స్కూల్ చైర్మన్ లక్ష్మన్న, కోడిగుడ్ల నాగిరెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని పెద్దకడబూరు, నౌలేకల్ గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ ఈ-పంట నమోదును తహశీల్దార్ శ్రీనాథ్, ఎఒ వరప్రసాద్‌లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడారు. ఈ-పంట నమోదు వల్ల రైతులకు అనేక ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. పంట నమోదు వల్ల పంట అమ్మకానికి, నష్టపరిహారం అందించటానికి అవకాశాలు ఉంటాయన్నారు. విఆర్ఒ నరసన్న, వ్యవసాయ సహాయకులు శ్వేత, బజారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని పులికనుమ సమీపంలో ఆదోని, రాయచూరు రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయ వీరేష్ (13) అనే బాలుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి... మండలంలోని బసలదొడ్డి గ్రామానికి చెందిన బోయ వీరేష్, అతని అవ్వ హనుమంతమ్మతో కలిసి ఆటోలో ఆదోనికి బయల్దేరారు. కోసిగి మండలం దొడ్డి బెళగల్ గ్రామానికి చెందిన కురువ హనుమంతు బొలెరో వాహనం పులికనుమ సమీపంలో ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న బోయ వీరేష్‌కు తీవ్ర గాయాలై మృతి చెందాడు. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. పెద్దకడబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తుంగభద్ర నదిలో భక్తుడు గల్లంతు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం సమీపంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లి సుబ్బారాయప్ప (45) అనే భక్తుడు గల్లంతయ్యారు. మంగళవారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కర్ణాటక రాష్ట్రం చిక్ బళ్లాపూరు జిల్లా ద్వారగనహల్లి గ్రామానికి సుబ్బారామప్ప కుటుంబ సభ్యులతో కలిసి మంత్రాలయం వచ్చారు. తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లి కాలు జారి లోపలికి వెళ్లగా కుటుంబ సభ్యులు కేకలు వేశారు. అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు రంగస్వామి, దశరథ రాముడు, చెన్న బసప్ప, రాఘవేంద్రతో పాటు పుట్టీల నిర్వాహకులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. సుబ్బారాయప్ప భార్య కూడా పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారని, వారికి 8 ఏళ్ల కుమార్తె ఉందని చెప్పారు.

ఆశావర్కర్లకు పని భారం తగ్గించాలి

- రూ.26 వేలకు వేతనాలు పెంచాలి

- యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరమ్మ

ప్రజాశక్తి - ఆస్పరి

ఆశా వర్కర్లకు పని భారం తగ్గించి, పనికి తగ్గ వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని సూపర్‌వైజర్లు రామాంజినమ్మ, వసంత కుమారి, లక్ష్మీ కాంతమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో భాగంగా ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. గ్రామంలో వెయ్యిమంది జనాభాకు ఒక ఆశావర్కర్‌ను నియమించాలని, రికార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి లక్ష్మి, ఆశాలు రాధమ్మ, నాగలక్ష్మి, మహేశ్వరి, పద్మ, సుజాత పాల్గొన్నారు. **నందవరం** ప్రభుత్వాస్పత్రిలో ఆశావర్కర్లు నిరసన చేపట్టారు. వైద్యాధికారిని శ్రీలేఖకు వినతిపత్రం అందజేశారు. అలాగే హాలహర్వి గ్రామంలో నిరసన చేపట్టి వైద్యాధికారులు డాక్టర్ పరిమిళ, డాక్టర్ విజయభారతికి వినతిపత్రం అందజేశారు. సిఐటియు తాలూకా కార్యదర్శి రాముడు, ఆశావర్కర్లు జి.రామేశ్వరి, సి.చిట్టెమ్మ, బి.నాగవేణి, కె.భూలక్ష్మి, లలిత, పరిమళ, సుజాత, రోజా, ధనలక్ష్మి, శిరీష, పుష్ప పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలం పెద్దతుంబలం, పెద్దహరివాణం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి, ఆశావర్కర్ యూనియన్ మండల కార్యదర్శి రాజేశ్వరి, లావణ్య, పార్వతి, సుకన్య, నరసమ్మ, శివలీల, భారతి, నాగేంద్రమ్మ పాల్గొన్నారు. **హాలహర్వి** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మన్సూర్ వలీకి వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల అధ్యక్షులు కృష్ణ, సిఐటియు నాయకులు విఠల్, ఆశావర్కర్లు శివమ్మ, విజయ లక్ష్మి, సునీత, ద్రాక్షవేణి, సుజాత, అంపమ్మ, చంద్రకళ, సునీత, సుజాత, శ్రీలక్ష్మి, మల్లమ్మ, జయమ్మ, రమీజాబీ, చెన్నవీరమ్మ పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలం కలుదేవకుంట గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం డాక్టర్ గోవిందమ్మకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు హెచ్.జయరాజు, టి.ప్రాణేష్, ఆశాలు పుష్ప, సారమ్మ, ఈరమ్మ, హసీనాబీ పాల్గొన్నారు.

ఆస్పరిలో వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

నందవరంలో వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

కూటమి ప్రతిష్టను దిగజారుస్తున్న ఎమ్మెల్యే

- టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ అప్సర్ బాషా

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి (బిజెపి) కూటమి ప్రతిష్టను దిగజారుస్తున్నారని టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ అప్సర్ బాష విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 60, 40 శాతం జరగనివ్వను.. సాగవని చెప్పి, ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి కలిసి ఆదోనిలో 60, 40 నడుపుతున్నారని విమర్శించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు సహాయ, సహకారాలతో, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తల పట్టుదల, కృషితో ఆదోనిలో బిజెపి అభ్యర్థి గెలుపొందారని తెలిపారు. గెలవకముందు ఒక మాట, గెలిచాక మాట చెప్పడం ఎమ్మెల్యే పార్థసారథికే సాధ్యమని విమర్శించారు. కొన్ని సమావేశాల్లో కొంతమంది అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వకుండా నటన చాతుర్యంతో నవ్వుతూ నిందలను వేరే వారిపై రుద్దడంలో ఎమ్మెల్యే పార్థసారథి సక్సెస్ అయ్యారని మండిపడ్డారు. ఆదోని అభివృద్ధి కోసం నిధులు తెచ్చిందేమీ లేదని విమర్శించారు. కూటమికి అన్యాయం చేస్తూ, సొంత పార్టీ బిజెపిలో సీనియర్ నాయకులతో పాటు కార్యకర్తలు కూడా ఆయనపై అసహనం ఉందని తెలిపారు. ఎమ్మెల్యేపై వ్యతిరేకతోనే మాజీ ఎమ్మెల్యే, బిజెపి నాయకులు పార్టీకి రాజీనామా చేశారని చెప్పారు. కూటమి నాయకులను పట్టించుకోకపోవడంతో పాటు కూటమి నాయకుల గురించి బహిరంగంగా మాట్లాడడం సబబు కాదని హితవు పలికారు.

వివక్షపై పోరాటం.. కెవిపిఎస్ లక్ష్యం

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం

ప్రజాశక్తి - నందవరం

అంటరానితనం, కులవివక్షపై పోరాటం చేయడమే కెవిపిఎస్ లక్ష్యమని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం తెలిపారు. మంగళవారం కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నందవరం గ్రామంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రజక వృత్తిదారుల సంఘం నాయకులు గురుశేఖర్ హాజరయ్యారు. కెవిపిఎస్ నాయకులు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా గురుశేఖర్ మాట్లాడారు. దళితుల పక్షాన నిలిచి అలుపెరగని పోరాటాలు చేస్తూ కెవిపిఎస్‌ను నడిపిన నాయకులకు అభినందనలు తెలిపారు. రాబోయే కాలంలో దళితులకు మరింత అండగా నిలవాలని కోరారు. డప్పు కళాకారుల సంఘం జయరాజు, షడ్రక్, కెవిపిఎస్ నాయకులు దాస్, రాయచోటి దేవపుత్ర, స్వామిదాస్ పాల్గొన్నారు.

జెండాను ఎగురవేస్తున్న నాయకులు

మహాలక్ష్మి అలంకారంలో వాసవీ మాత

ప్రజాశక్తి - మంత్రాలయం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవాసవి మాత భక్తులకు మహా లక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. మంగళవారం స్థానిక శ్రీవాసవి కల్యాణ మండపంలో మహా లక్ష్మి అమ్మవారిని సుమారు రూ.4 లక్షల విలువ గల నోట్లతో అలంకరించారు. రూ.10, 20, 100, 200 నోట్లతో అమ్మవారికి అలంకారం చేశారు. పురోహితుడు గతమాచార్ ఆధ్వర్యంలో అమ్మ వారికి హోమాలు, దూప, దీప, నైవేధ్యాలతో, పసుపు, కుంకుమలతో, వేద మంత్రాల మధ్య పుష్పార్చనతో అర్చించి మంగళ హారతులు ఇచ్చారు. మంత్రాలయానికి చెందిన రంగనాథ్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపిటిసి వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు.


మంత్రాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉలెన్ ధారాలతో శ్రీలక్ష్మమ్మ అవ్వకు అలంకారం

ఆదోనిరూరల్ : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో వెలిసిన శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వను ఉలెను ధారాలతో అలంకరించారు. గ్రామీణ, పట్టణ ప్రజలు పూజలు చేశారు. ఆలయ వంశంపారంపర్య ధర్మకర్తలు రాచోటి రామయ్య, రాచోటి సుబ్బయ్య అవ్వను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మహా లక్ష్మి అలంకరణలో గాయత్రీ మాత

ఆస్పరి : మండలంలోని రామతీర్థంలోని కొండపై వెలసిన శ్రీగాయత్రీ మాత దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు రూపమోహన్ ఆధ్వర్యంలో శంకర బండ గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు సుధాకర్ కుటుంబ సభ్యులతో కలిసి గాయత్రీ మాతకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున రావడంతో దేవాలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మహాలక్ష్మి అలంకారంలో మారెమ్మ దేవి

కౌతాళం : దసరా సందర్భంగా నవరాత్రి ఉత్సవాలు ఉప్పరహాల్ గ్రామంలో వైభవంగా సాగుతున్నాయి. మారెమ్మ దేవి మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా భక్తుల సమక్షంలో పురాణం కార్యక్రమం నిర్వహించారు. దేవతల విశిష్టత గురించి వివరించారు.



In The Court of The Principal. Judge Family Court AT Ballari.

M.C.No:264/2023

Between:
Jeer Mallappa ...**Petitioner**
And
Smt.Nethravathi ...**Respondant**

To,
Respondent Smt.Nethravathi W/o Jeer Mallappa D/o jeer Gadilingappa. R/o. Gulyam village. Alur Taluk. Kurnool District. A.P.

SUMMONS

WHEREAS, the above named petitioner has filed the above suit against you seeking decree of divorce. You are hereby summoned to appear before this Hon'ble court in person or by pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be instructed and able to answer all such question on the day of 14/11/2024 at about 11:00 "O" clock in the forenoon to answer the claim and further you are hereby directed to file on that day your objections and to produce on the said day all documents in your possession or power upon which, you base your defence or claim for set off or counter claim in support of your defence.

Take notice that in Default of your appearance on the day before mentioned, The Suit Will be heard and determined in your absence. Given under my hand and Seal of the Court on this 01 st day of October 2024.

\\By order of the Court//

V.BHEEMAPPA
Advocate for the petitioner, Ballari.

Sheristedar
Principal Judge Family Court AT Ballari.

వణ్యప్రాణుల సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - రుద్రవరం : 70వ వన్య ప్రాణివారోత్సవాల సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్, ప్రాజెక్ట్ టైగర్ అనురాగ్ మీనా, ఐఎఫ్ఎస్ వారి ఆదేశాల మేరకు, శ్రీనివాస్ రెడ్డి సబ్ డిఎఫ్ఓ రుద్రవరం వారి సూచనల మేరకు, బి. శ్రీపతి నాయుడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, రుద్రవరం వారి పర్యవేక్షణలో ఈ నెల 2వ తేదీ నుంచి రుద్రవరం అటవీ క్షేత్రంలోని రుద్రవరం, నూతన సెక్షన్ పరిధిలోని తువ్వపల్లె,రెడ్డి పల్లె,నర్సాపురం, హరినగరం,ఆర్ నాగులవరం, లింగందిన్నె గ్రామాలలో వణ్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. వారోత్సవాలలో చివరి రోజు మంగళవారం శిపాల్లెడ్డి పల్లె గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్య ప్రాణుల వేట వంటి నేర ప్రవృత్తులు విడనాడి వన్య ప్రాణుల సంరక్షణలో భాగస్వాములు అవ్వాలని, అటవీ ప్రాంతంలో రోడ్డుపై ఆహార పదార్థాలు అడవి జంతువులకు వేయవద్దు అని, వాహన వేగాన్ని తగ్గించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని, రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దు వెంబడి వన్య ప్రాణుల ఆవాసాలను గుర్తించి మానవ కార్యకలాపాలను తగ్గించి అడవి జంతువులు, మానవుల సంఘర్షణను తగ్గించాలని, అడవులకు నిప్పు పెట్టరాదని, అడవులకు నిప్పు పడకుండా వాటిని ఆర్పడంలో అటవీశాఖవారికి గ్రామస్తులు సహకరించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీనివాసుల రెడ్డి, ఎఫ్ఎస్ఓ.,రాజేష్, ఎఫ్బిఓ నరసింహ రెడ్డి, సురేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో స్పాట్, మేనేజ్మెంట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - నంద్యాల: శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల(అటానమస్)లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి కళాశాలలో స్పాట్, మేనేజ్మెంట్ కోటా అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం విద్యార్థులు అక్టోబరు 7 నుండి 14వ తేదీ వరకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలలో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు. స్పాట్ అడ్మిషన్లు, మేనేజ్మెంట్ కోటా పొందిన వారికి ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు ఉండవని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్‌ను, 9701805678, 9985240952 నంబర్లను సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ కేబీవీ సుబ్బయ్య తెలిపారు.

అంగన్వాడీ వర్కర్, హెల్పర్ పోస్ట్‌లకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడి వర్కర్, హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఆళ్లగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి తేజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆళ్లగడ్డ మండలంలోని నల్లగట్ల, శిరివెళ్ళ మండలంలోని గుంప్రమానుదిన్నె, ఎర్రగుడిదిన్నె గ్రామాలలో అంగన్వాడి వర్కర్ పోస్టులు ఖాళీగా ఉండగా 16 కేంద్రాలలో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని సిడిపిఒ తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని పేరూరు, పెద్ద కంబలూరు-1, చిన్న భోదనం, నక్కలదిన్నె, నేలంపాడు దొర్నిపాడు-5, ఆలమూరు-3, మున్సిపాలిటీ పరిధిలోని దేవరాయపురం 1 ,2 కేంద్రాలు అహోబిలం-3, ఆళ్లగడ్డ-6,4 , గుండంపాడు-2, చింతలచెరువు-2, వెంకటేశ్వర నగర్, రుద్రవరం-2 కేంద్రాలలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఆమె తెలిపారు. వర్కర్ పోస్టుకు 21 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు , 10వ తరగతి చదివారు మాత్రమే అర్హులని తెలిపారు. వారు తప్పనిసరిగా వివాహితులై స్థానికంగా నివాసం ఉండాల్సి ఉంటుందని తెలిపారు. అర్హత కల వారు ఈనెల 21 లోపు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ

- సురక్షిత మంచినీటిని అందించండి
- మురికి నీటి శుద్ధి ప్లాంటలకు స్థలాల ప్రతిపాదనలు పంపండి
- అన్న క్యాంటీన్లను పర్యవేక్షించండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని మున్సిపల్ ప్రాంతాలలో పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్లో అన్న క్యాంటీన్లు, 200 రోజుల ప్రణాళిక, ఎస్టిపి ల్యాండ్, పట్టణ సుందరీకరణ, శానిటేషన్, తాగునీటి సరఫరా తదితర అంశాలపై మునిసిపల్ కమిషనర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని మున్సిపల్ పట్టణ ప్రాంతాలలో ముమ్మర పారిశుద్ధ పనులు చేపట్టడంతో పాటు సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలన్నారు. పట్టణ సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వంద రోజుల ప్రణాళికలో చేపట్టి పూర్తి చేసిన పనులన్నిటిని తాను స్వయంగా పరిశీలిస్తానన్నారు. అలాగే 200 రోజుల ప్రణాళిక లక్ష్యాల నివేదికను తనకు సమర్పించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నూతనంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్లను తరచూ పర్యవేక్షించాలన్నారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించడంతోపాటు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు సంబంధించి వార్తాపత్రికలలో ప్రతికూల వార్తలు వస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. మురికి నీటి శుద్ధి ప్లాంటలకు అవసరమయ్యే స్థలాలకు సంబంధించి నంద్యాలలో 3 ఎకరాలు, ఆళ్లగడ్డలో 2.8, ఆత్మకూరులో 3, నందికొట్కూరులో 3.4, డోన్ లో 7.5 ఎకరాల స్థల సేకరణ కొరకు సంబంధిత ఆర్డీవోతో కోఆర్డినేట్ చేసుకొని వారం రోజుల్లో సంబంధిత ప్రతిపాదనలు కలెక్టరేట్కు పంపాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు మున్సిపాలిటీలలో అందుబాటులో ఉన్న నిధులతో పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డోన్ మున్సిపాలిటీలో అమృత్ సరోవర్ కింద ఈఎల్ఎస్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమయ్యే 20 సెంట్లు స్థలాన్ని కూడా సంబంధిత ఆర్డీవోతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని డోన్ మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. నంద్యాల పట్టణంలో జమ్మలాగ్నేకల్ చెరువు అవసరమైన 5 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని నంద్యాల ఆర్డీవోకు సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ఇప్పటినుండే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కమిషనర్లను సూచించారు. నంద్యాల పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అన్ని మున్సిపాలిటీలలోని పట్టణ ప్రజలను ఆహ్లాదంగా తలపించేలా గ్రీనరీని పెంచడంతో పాటు ఆకర్షణీయమైన రీతిలో రోడ్లకు ఇరువైపులా రంగులతో దిద్దిన చిత్రాలను వేయడంతోపాటు డివైడర్ల మధ్యలో గ్రీనరీని పెంచాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. సమావేశంలో నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ బేబీ, డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

200 రోజుల ప్రణాళిక, పట్టణ సుందరీకరణ పై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

సుశీలమ్మను పరామర్శిస్తున్న మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి

సుశీలమ్మను పరామర్శించిన బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు బొబ్బల మహేశ్వర రెడ్డి తల్లి బొబ్బల సుశీలమ్మను మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి మంగళవారం పరామర్శించారు. గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని సుశీలమ్మ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి ఆమె ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.

కెజిబివిల్లో నాన్ టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటి (పాఠశాల విద్యాశాఖ) ద్వారా నిర్వహించబడుతున్న జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలలో ఖాళీగా ఉన్న 4 బోధనేతర (నాన్ టీచింగ్) సిబ్బంది పోస్టులను పొరుగుసేవల (ఔట్ సోర్సింగ్) ప్రాతిపదికన 2024-25 విద్యా సంవత్సరం (ఒక సంవత్సరం) కాలానికి భర్తీ చేయడానికి అర్హులైన ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఈ నెల 7వ తేదీ నుండి 15వ తేదీ వరకు స్వీకరించడమవునని జిల్లా విద్యాశాఖాధికారి కే.సుధాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆఫ్ లైన్ ద్వారా అందజేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న టైప్ 3 కేజీబీవీల్లో 3 పోస్టులకు, అసిస్టెంట్ కుక్-1 పోస్ట్, డే, నైట్ వాచ్ ఉమెన్ - 2 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే టైప్ 4 కేజీబీవీలో 1 అసిస్టెంట్ కుక్ పోస్టుకు గాను దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 1.7.2024 నాటికి ఓసీకి 42 సంవత్సరములు, ఎక్స్ సర్వీస్ మెన్ కి 45 సంవత్సరములు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 47 సంవత్సరములు, పీహెచ్ సి వారికి 42 సంవత్సరములు ఉండాలన్నారు. అసిస్టెంట్ కుక్ పోస్టులకు ఎడ్యుకేషనల్ విద్యార్హతలు మ్యాన్ డేటరీ కాదని, అలాగే డే నైట్ వాచ్ మెన్ పోస్టుకు కనీసం విద్యార్హత 7వ తరగతి పాసై ఉండాలన్నారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆఫ్లైన్ దరఖాస్తులను ఈ నెల 15 వరకు స్వీకరించబడునని పేర్కొన్నారు మండలాల వారిగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితా తయారీ ఈ నెల 16 వ తేదీ నుండి మండలాల నుండి 17వ తేదీలలో సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ (ఏపీసీ) కార్యాలయానికి దరఖాస్తుల సమర్పించాలన్నారు. ఈ నెల 18 న జిల్లా స్థాయిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తుది జాబితా తయారీ చేయడం జరుగుతుందన్నారు. నమూనా దరఖాస్తును మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుండి పొందాలని తెలిపారు.

అంతర్జాతీయ వికలాంగ క్రీడాకారుడికి మంత్రి సత్కారం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలకు చెందిన అంతర్జాతీయ వికలాంగ క్రీడాకారుడు అర్షద్‌ను మంగళవారం రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. నంద్యాల ఐఎంఎ, వికలాంగుల సంక్షేమ సంఘం, లయన్స్ క్లబ్ , కళారాధన ఆధ్వర్యంలో మంత్రి ఫరూక్ చేతుల మీదుగా శాలువ జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అర్షద్ ఇటీవల ప్యారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్‌లో సైక్లింగ్‌లో భారతదేశం తరపున పాల్గొన్నాడు. పారా ఒలింపిక్స్‌లో సైక్లింగ్‌లో భారతదేశం పాల్గొనడం ఇదే మొదటిసారి. నంద్యాలకు చెందిన అర్షద్ 10 సంవత్సరాల వయసులో రోడ్డు ప్రమాదంలో ఒక కాలు కోల్పోయాడు. ప్రమాదం జరగక ముందు తైక్వాండో క్రీడలో పతకాలు సాధించిన అర్షద్, ప్రమాదంలో కాలు కోల్పోయిన తర్వాత డాక్టర్ రవికృష్ణ ప్రోత్సాహంతో విలువిద్యలో (ఆర్చరీ) ప్రత్యేక కోచ్‌తో నంద్యాలలో శిక్షణ పొంది జాతీయస్థాయిలో పాల్గొని పతకాలు సాధించాడు. అటు తరువాత హైదరాబాద్ మెహతా ఫౌండేషన్‌లో ఇచ్చిన ప్రోత్సాహంతో హిమాలయాల్లో భాగీరథి పర్వతాన్ని ఒక కాలుతోనే అధిరోహించాడు. బిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఒక కాలుతోనే సైకిల్ యాత్ర చేశాడు. స్విమ్మింగ్ బాడీ బిల్డింగ్‌లో కూడా రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాడు. డాక్టర్ రవికృష్ణ అర్షద్‌కు ప్రభుత్వ ఉద్యోగం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఇప్పించాలని మంత్రి ఫరూక్‌కు విజ్ఞప్తి చేశారు. మంత్రి స్పందిస్తూ ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించడానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ, ఐఎంఎ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వసుధ రాణి ,డాక్టర్ పనీల్, రాష్ట్ర నాయకులు డాక్టర్ అనిల్ కుమార్, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ఎంపీవి రమణయ్య,కార్యదర్శి శిరిగిరి రమేష్, ఉపాధ్యక్షులు సోమేశుల నాగరాజు, జిల్లా చైర్మన్ శ్రీకాంత్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్షద్‌కు ప్రభుత్వ ఉద్యోగం కోసం మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఎంపిడిఓకు టిడిపి నాయకులు సన్మానం

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన బివి రమణను ఎంపీడీవో కార్యాలయంలో టిడిపి నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టిడిపి నాయకులు ఎంపిడిఒను కోరారు.

కార్యక్రమంలో టిడిపి నాయకులు సయ్యద్ హైదర్, అన్వర్ సాహెబ్, మెకానిక్ బాబు, కోడి రమణ యాదవ్, జాలిస్, అలీ హుస్సేన్, హసన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు

- ఆళ్లగడ్డ ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ ఎక్సైజ్ శాఖ పరిధిలో కొత్తగా మద్యం దుకాణాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆళ్లగడ్డ ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి పేర్కొన్నారు. శిరివెళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ వంశీధర్ ఆధ్వర్యంలో సిరివెళ్ల పోలీస్ స్టేషన్లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ నెల 12 నుంచి కొత్త మద్యం విధానం అమల్లోకి రానుండటంతో మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ నెల 11న లాటరీ ద్వారా మద్యం షాపులు ఖరారు చేయనుండగా 12వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం షాపులు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. ఆళ్లగడ్డ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మొత్తం 19 మద్యం దుకాణాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలో 4, ఆళ్లగడ్డ రూరల్ పరిధిలో 2, సిరివెళ్ల మండలంలో 4, గోస్పాడు మండలంలో 3, రుద్రవరం మండలం పరిధిలో 3, చాగలమర్రి మండల పరిధిలో 3 మొత్తం 19 షాపులు ప్రభుత్వం కేటాయించినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రూ. 55 లక్షలు, రూరల్ పరిధిలో రూ. 55 లక్షలు, శిరివెళ్ల పరిధిలో రూ.65 లక్షలు, గోస్పాడు పరిధిలో రూ. 55 లక్షలు, రుద్రవరంలో రూ.55 లక్షలు, చాగలమర్రిలో రూ.65 లక్షల ప్రకారం షాపులకు లైసెన్స్ ఫీజు ప్రభుత్వం ఖరారు చేసినట్లు తెలియజేశారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చునని ఒకే వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చన్నారు. **రుద్రవరం :** రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానంలో టెండర్ వేసేందుకు ప్రతి వ్యక్తి నిరభ్యంతరంగా నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ శాఖ సీఐ కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఆయన పాత్రికేయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి ఎన్ని మద్యం షాపులకైనా ఎక్కడి నుంచైనా ఆన్లైన్లో కానీ, ఆఫ్లైన్లో కానీ రెండు లక్షల రూపాయల రుసుము చెల్లించి ఈనెల 9 వతేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు భయపడకుండా, అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి డిపాజిట్ చెల్లించవచ్చన్నారు. ఈ నెల 11న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ డిప్పు ద్వారా అర్హులను ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో రుద్రవరం ఎస్సై వరప్రసాద్, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్లు నాగేంద్ర, షరీఫ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆళ్లగడ్డ ఎక్సైజ్ సీఐ

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు : ఎఒ

ప్రజాశక్తి- రుద్రవరం

రైతులు సాగు చేసిన పంటలలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. మంగళవారం సిరివెళ్ల మండలంలోని గుండంపాడు, మహాదేవపురం రైతు సేవా కేంద్ర పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎఒ మాట్లాడుతూ పొగాకు పంటలో యాజమాన్య, సస్యరక్షణ పద్ధతులు వివరించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, రైతులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజీ తెలిపారు. మండలంలోని చాగలమర్రి, మల్లెవేముల గ్రామాల రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం పై అవగాహన కల్పించారు. వరి, మొక్క జొన్న, మినిము పంటలలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పశు వైద్యాధికారి సాయి బాబ పశు భీమా, పశువులకు వేయించు టీకాల గురించి వివరించారు. ఏఈఓలు, గ్రామ వ్యవసాయ,ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

మహాలక్ష్మి దేవి అలంకారంలో వాసవి మాత అమ్మవారు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని శ్రీ మహాలక్ష్మి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేవిశెట్టి హరీష్ బాబు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ మూర్తిని స్వర్ణ దివ్య భరణాలతో అలంకరించి అలంకార మండపంలో కొలువు తీర్చారు. తమిళనాడు అంబూరు వాస్తవ్యులు సౌందర్య రాజన్ అలంకారాల నిమిత్తం ప్రత్యేకంగా రప్పించి ప్రతినిత్యం ఒక అలంకారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, ఆయుష్య హోమము రాజశ్యామల హోమము నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేవిశెట్టి హరీష్ బాబు తెలిపారు.

అన్నపూర్ణ దేవి అలంకారంలో వాసవి మాత.

రుద్రవరం : రుద్రవరంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో 6వ రోజు వాసవి మాత అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో లలితా సహస్ర నామ పారాయణం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అంతరం దుప దీప హారతులు సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం వారు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పూజా దాతలు లింగం వెంకట రంగనాయకులు, రాధాకష్ణమూర్తి, శ్రీనివాసులు, రమేష్ బాబు, లింగం రోశయ్య కుమారుడు శ్రీనివాసులు మరియు వారి కుటుంబసభ్యులు, ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ చోళవేటి సూర్యనారాయణ, కోశాధికారి పెరుమాళ్ళ నరసింహయ్య, సెక్రటరీ పాలూరు సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు, రుద్రవరం గ్రామ మరియు మండల పరిసర ప్రాంతాల ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పర్యాటకం అభివృద్ధికి కృషి చేస్తా

ఎపి టూరిజం డైరెక్టర్ ముంతాజ్ -మంత్రి టిజి. భరత్‌కు గజమాలతో సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పర్యాటక అభివృద్ధికి తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని ఎపి టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్, కర్నూలు పార్లమెంటు తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు ముంతాజ్ అన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్ గా నియామకం అయిన నేపథ్యంలో మంత్రి టిజి.భరత్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ మంగళవారం కర్నూలు మౌర్య ఇన్ హోటల్లో గజమాలతో ఆయనను ఆమె ఘనంగా సన్మానించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ పార్టీలో తన సేవలను గుర్తించి తనకు ఎపి టూరిజం డైరెక్టర్ గా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నారా లోకేష్ కు మంత్రి టీజీ భరత్‌కు జిల్లా అధ్యక్షులు తిక్క రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. ముస్లిం మహిళగా తన సేవలను గుర్తించి మొదటి జాబితాలోనే తన పేరును ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పర్యాటక రంగం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. కార్పొరేటర్లు కురవ పరమేష్, పుల్లమ్మ, నవీన్, టిడిపి మైనార్టీ జిల్లా కార్యదర్శి షేక్షావలి, తెలుగు మహిళా నాయకులు పలువురు పాల్గొన్నారు.

మంత్రి టిజి. భరత్‌కు గజమాలతో సన్మాన చేస్తున్న ఎపి టూరిజం డైరెక్టర్ ముంతాజ్

మాతా శిశు మరణాలను నివారించండి: డాక్టర్ శ్రీలక్ష్మి

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలకు డాక్టర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఆషాడే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు మాతా శిశు మరణాలు తగ్గించాలని ,దీనికై గర్భవతులు ,బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఏ ఒక్కరూ అనీమియాతో బాధపడరాదని, ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేటట్లు చూడాలని సూచించారు. ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత , సురక్షితమైన తాగునీరు పై అవగాహన కల్పించాలని సూచించారు సీజనల్ వ్యాధులు మలేరియా ,డెంగ్యూ ,అతిసారా , కలుషిత ఆహారంపై అవగాహన కల్పించాలని తెలిపారు. క్షయ కుష్టు వ్యాధులపై సర్వే నిర్వహించి వ్యాధులను గుర్తించి చికిత్సలు అందజేయాలని సూచించారు.ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే నిర్వహించాలని, ఈ ఆశ యాప్‌సేవలు ప్రతిరోజు పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం కిల్కారి వాయిస్ మెసేజ్ పై గర్భవతులు, బాలింతలకు వినేటట్లు చూడాలని తెలిపారు .అనంతరం మాతా శిశు ఆరోగ్యం పై ఆశా కార్యకర్తలకు అవగాహన కలిగించారు.కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, హెల్త్ సూపర్వైజర్ సూర్యనారాయణ, హెల్త్ ప్రొవైడర్లు, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మి , అంజలి ,సువర్ణ మాబ్బున్నీ, గాయత్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నవరాత్రి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య ఆశీస్సులతో కర్నూలు శ్రీ సూర్య నారాయణ స్వామి దేవాలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి సందర్భంగా మంగళవారం శ్రీ మహాగౌరీ అమ్మవారికి విశేష అభిషేకం, అర్చనలు జరిగాయని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ టి.శివ రామకృష్ణ అన్నారు. ఆయన మాట్లాడుతూ మహా గౌరీ అమ్మవారిని మహా గౌరీ దేవి దేవి రూపంలో అలంకరించి. మంటపారాధన దేవి ఖడ్గమాల లలితా సహస్రనామాలతో అర్చన చేశామన్నారు. సాయంత్రం ప్రదోషకాల సమయంలో షోడశోపచార పూజ, లలితా సహస్రనామం, రవికలతో అర్చన, మహా గౌరీ అష్టోత్తరం, జరిగినవి. అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కంటి చూపుకు క్యారెట్ మేలు చేస్తుంది

సుశీలనేత్రాలయ వైద్యులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పారదర్శకంగా ఉండాల్సిన కటకం ముదిరిపోయినప్పుడు మబ్బుగా మారినప్పుడు చూపు మందగిస్తోందని సుశీల నేత్రాలయ వైద్యులు చందు, నాగార్జున తెలిపారు. మంగళవారం కర్నూలు నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో కర్నూలు లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో వరల్డ్ లయన్స్ క్లబ్ సర్వీస్ డే సందర్భంగా సుశీల నేత్రాలయ హాస్పటల్ అధినేత సుధాకర్ రావు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుశీల నేత్రాలయ వైద్యులు చందు, నాగార్జున మాట్లాడుతూ కంట్లో శుక్లం మొదలైనప్పుడు కటకం క్రమంగా ముదిరిపోతూ ఎండు కొబ్బరిలా మారుతుందని చూపుకు ప్రమాదం పెడుతుందన్నారు. కంట్లో శుక్లాలను తొలగించేందుకు ఆపరేషన్ పరిష్కార మార్గమన్నారు. రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత మాట్లాడుతూపాలకూర ,క్యాప్సికం చిలకడదుంపలు, టమోటా రసాయనాలు కంటికి ఉపయోగమన్నారు. కర్నూలు లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రత్న ప్రసాద్ మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరానికి వంద మందికి పైగా హాజరయ్యారని 50 మందికి పైగా ఉచితంగా అద్దాల పంపిణీ, పదిమందికి పైగా ఉచితంగా కంటి ఆపరేషన్లు ,పదిమందికి పైగా మందులు పంపిణీ చేశామన్నారు. చిట్టెమ్మ, అయ్యమ్మ, పార్వతమ్మ నాగప్ప ఇలియాస్, ఆంజనేయులు, రాముడు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవితానికి రక్షణ సూత్రాలు

డాక్టర్ సోని సుసాన్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఆరోగ్యకరమైన జీవితానికి మంచి సూత్రాలు అలవాట్లు అలవరచకోవాలని, అవే రక్షణ గా ఉంటయని డాక్టర్ సోని సుసాన్ అన్నారు. కర్నూలు కోల్స్ హై స్కూల్ అవరణంలో చైల్డ్ ఫెలో షిప్ ఆఫ్ కర్నూల్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 13వ చిల్డ్రన్స్ గుడ్ న్యూస్ క్యాంప్ రెండవ రోజు డాక్టర్ సోనీ సుసాన్ ముఖ్య అతిథిగా పాల్గొని బాలికలకు ఆరోగ్యకరమైన జీవితానికి తీసుకోవలసిన ఆరోగ్య సూత్రాలను పవర్ పాయింట్ ద్వారా దృశ్య రూపకంగా వివరించారు. నేడు మానవుడు ఫాస్ట్ ఫుడ్ కు జంక్ ఫుడ్‌కు అలవాటు తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుని రోగాల బారిన పడుచున్నారన్నారు. వీటన్నీటికి దూరంగా ఉండి పోషక పదార్థాల తో కూడిన బలవర్ధకమైన ఆహారం తీసుకొని ఆరోగ్య వంతులుగా ఉండాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను గూర్చి వివరించారు. కమిటీ చైర్మన్ ఆర్ ఈ అనిల్ నాథ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, సిఇఫ్ డైరెక్టర్ ప్రభుదాస్, లతాదాస్ కమిటీ సభ్యులు సుధీర్ స్టెల్లా పాల్ పాల్గొన్నారు.

13వ చిల్డ్రన్స్ గుడ్ న్యూస్ క్యాంప్‌కు హాజరయిన చిన్నారులు

ఎంపిడిఒను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మద్దికేర

కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ కొండయ్యను శాలువాలతో సత్కరించి మర్యాదపూర్వకంగా కలిసినట్లు టిడిపి సీనియర్ నాయకులు తెలిపారు. మండల కేంద్రమైన మద్దికేర ఎంపిడిఒ ఆఫీస్‌లో సోమవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలం లో అభివృద్ధి పనులకు, ప్రజలకు, నాయకులకు, అందుబాటులో ఉండి తమ సేవలను అందించాలని వారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకులు ఆనందు ఎంపిటిసి శ్రీనివాసులు హరినాథ్ గౌడ్ పాల్గొన్నారు.

ఎంపిడిఒను శాలువాతో సత్కరిస్తున్న టిడిపి నాయకులు